సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు

● అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయొద్దు ● సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాలరెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అనవసర లింక్‌లు ఓపెన్ చేసి, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సైబర్ జాగురుకత దివస్‌ను పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డిలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ఇంపర్సులేషన్ వంటి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగురుకత దివస్ పేరుతో మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సైబర్ క్రైం అనేది ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అని, సైబర్ నేరాలకు గురి అవుతున్న వాళ్లలో అధికంగా విద్యావంతులే ఉన్నారన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ప్రభుత్వ స్కీంలు, నకిలీ కరెంట్ బిల్లు, ఆన్‌లైన్‌లో కొరియర్, లోన్ యాప్, వివిధ రకాల ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయక ప్రజలను సైబర్ బాధితులుగా చేస్తున్నారన్నారన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో గుర్తు తెలియని, కొత్త ఫోన్ నెంబర్ల నుంచి అపరిచిత వ్యక్తి వీడియో కాల్ చేసి, వీడియో రికార్డు చేసి బెదిరింపులకు గురిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులం, కస్టమ్స్ అధికారులం అని కాల్స్ వస్తే భయపడొద్దని, ఏ పోలీసు అధికారి వీడియో కాల్ చేయరని గుర్తించాలన్నారు. సోషల్ మీడియాలో ఏదైనా కొత్త లింక్ ఓపెన్ చేసే ముందు ఒకటికి, రెండు సార్లు చెక్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు మారువేషంలో పొంచి ఉంటారాని గుర్తించాలన్నారు. సైబర్ మోసాల నుంచి తప్పించుకోవడానికి అవగాహన ఒక్కటే మార్గమని, సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 1930కి కాల్ చేసి గాని, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ httpr//www.cybercrime.gov.in నందు లాగిన్ అయి ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవి, టెక్నికల్ సపోర్ట్ పర్సన్ రాజలింగం, సంగారెడ్డి టౌన్, ఎస్ఐ, ఐటీ సెల్ సిబ్బంది, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాలరెడ్డి

కొండగట్టు అంజన్న దర్శనానికి రండి

పటాన్‌చెరుటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న దర్శనానికి రావాలని కాంగ్రెస్ నేత నీలం మధును ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు ఆహ్వానించారు. బుధవారం కరీంనగర్‌కు చెందిన మత్స్యకార సంఘం ముఖ్యనేతలు నీలంమధుతో సమావేశమై పలు విషయాలపై చర్చించి, సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులతో పాటు బీసీ, సబ్బండ కులాల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. బీసీ కులగణనలో ముదిరాజ్ కులస్తులకు రాజకీయంగా న్యాయం జరిగేలా చూడాలని నీలం మధుని కోరారు. కొండగట్టు అంజన్న దర్శనం చేసుకుంటే ఆ స్వామి ఆశీస్సులతో రాజకీయంగా ఆశించిన ఫలితాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ జెడ్పీటీసీ మల్లేష్, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల మాజీ చైర్మన్ పోలు లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నరసయ్య, కరీంనగర్ మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా డైరెక్టర్ శ్రీను, రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కొండాపూర్(సంగారెడ్డి): సమగ్ర శిక్ష అభియాన్ విభాగంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని సీఆర్పీ ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 6 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు బుధవారం ఎంఈఓ ధశరథ్‌కు సమ్మె నోటీస్ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విద్యాశాఖ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలలో మాత్రం వ్యత్యాసం ఉందన్నారు. సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్‌ల్లో చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలీనం చేయాలని కోరారు. ఈ నెల 6 నుంచి రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమ్మె నోటీస్ అందజేసిన వారిలో ఆనందం, జయశంకర్ రాజు, జ్యోతి, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీస్ అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పన్నులు చెల్లించండి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గృహ యజమానులు పారిశ్రామికవేత్తలు పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ మంగతాయారు కోరారు. బుధవారం పారిశ్రామిక వాడలోని ట్రాన్స్‌జెన్ పరిశ్రమ యాజమాన్యం గత సంవత్సరపు ఆస్తి పన్ను బకాయిలు రూ.1,91,260 లను కమిషనర్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా మొత్తం రూ.1587.02 లక్షల పన్నులకు గాను రూ.925.37 లక్షల పన్నులను ఇప్పటివరకు వసూలు చేసినట్లు తెలిపారు. మొత్తం 58 శాతం పన్నులు వసూలు చేశామన్నారు. ఆర్వో నర్సింలు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



పన్ను చెల్లిస్తున్న యాజమాన్యం

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సంగారెడ్డి టౌన్ : మండలంలోని కల్పగూర్ పరిధిలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంజీరా డ్యాంలో బుధవారం అటవీ అధికారులు విద్యార్థులకు అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరిగితే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో చెట్లు, వన్యప్రాణులకు ముప్పు కలిగే అవకాశం ఉందన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సోషల్ ఆడిట్

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై కొనసాగిన సోషల్ ఆడిట్‌కు సంబంధించి ఈ నెల 9 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం ఎం.షరీఫ్, ఏపీఓ రమేష్ పేర్కొన్నారు. 5వ తేదీన కుసునూర్, సింగితం, హస్నాబాద్, జంమ్గి, పీపడ్‌పల్లి, సిరూర్, ఇటికేపల్లిలో గ్రామసభలు ఉంటాయన్నారు. 6న శంశోద్దీన్‌పూర్, దౌల్తాబాద్, కోడూర్, మామిడిపల్లి, శాపూర్. 8న నాగన్‌పల్లిలో.. 9న సంగాపూర్, ఔరంగా నగర్, రాయికోడ్, మహమ్మదాపూర్, పాంపాడ్, నాగ్వార్, అల్లాపూర్, మొరట్గా, హుల్గేర, నల్లంపల్లి, యూసుఫ్‌పూర్, మాటూర్‌లో గ్రామసభలు ప్రారంభమవుతాయన్నారు.

కేతకీ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయ హుండీని బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని హుండీలో వేసిన నగదు మొత్తాన్ని లెక్కించారు. 89 రోజులకు రూ.32,98,710 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ ఈఓ శశిధర్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థల పరిశీలన

సంగారెడ్డి : మండల కేంద్రం చౌటకూర్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు నూతన పక్కా భవనాలు మంజూరైనట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం కోసం స్థలాన్ని సర్వే చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మశాన వాటిక పక్క నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే, సుల్తాన్‌పూర్ గ్రామంలో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యాలయాల నిర్మాణాలకు కృషి చేసిన మంత్రి దామోదరకు మండల ప్రజలు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్, ఉపాధ్యక్షుడు రామగౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వర్కల రమేష్, ప్రధాన కార్యదర్శి ఆగమయ్య, మండల సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సార గోవర్దన్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, కై సర్, ఈశ్వర్‌గౌడ్, ఆంజనేయులు ముదిరాజ్, మల్లికార్జున్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర

గురుకులంలో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆర్డీఓ రాంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల గదులు, వంటగది, హాస్టల్, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించొద్దని హెచ్చరించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భిక్షపతి, తహసీల్దార్ రవీందర్, ఎంఈఓ, బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శి వసంత, ప్రిన్సిపాల్ రాములు ఉన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

సంగారెడ్డి రూరల్: గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలోని తెలంగాణ బాలుర ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కాలేజీని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్యరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకు తమ సమస్యలు తెలియజేశారు. కుళ్లిన కూరగాయలతో భోజనం వడ్డిస్తున్నారని చెప్పారు. మెనూ ప్రకారం పెట్టడం లేదని వాపోయారు. కూరలు లేక కారం, నూనె కలిపి పెడుతున్నారు. కారంతో పెట్టడం ఏంటని ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్యరావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి, మంజు శ్రీ పాల్గొన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గురుకుల పాఠశాల సందర్శన

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలను విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంఘం విద్యార్థులకు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్, చెన్నారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు మాణిక్ యాదవ్, జిన్నారం మండల అధ్యక్షుడు వరుణ్, భీమ్రావు ఫయాజ్, నిఖిల్ గౌడ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. బుధవారం రామచంద్రాపురం పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్‌లు, ట్రైసైకిల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగవైకల్యం దేనికి అడ్డురాదని, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యాని సాధించవచ్చు అన్నారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహీన్‌గౌడ్, ఈశ్వర్ కపూర్, పీటర్, రాంజీ, నవీన్ గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లు, వీల్ చైర్‌లు పంపిణీ చేస్తున్న పుష్ప

కేజీబీవీ గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీ (కస్తూర్బాగాంధీ, బాలికల విద్యాలయం)లో గెస్ట్ ఫ్యాకల్టీగా భౌతికశాస్త్రం బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు కేజీబీవీ ప్రత్యేక అధికారి రుబీనా పర్వీన్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన మహిళా అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో స్థానిక కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

క్లుప్తంగా

వరికొయ్యలతో భూసారం పెంచాలి



అవగాహన కలిపిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరికొయ్యలను పొలంలో తగలబెట్టొద్దని ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. పోషకాలు పెంచుకుని పర్యావరణం, భూసారానికి ఉపయోగకరంగా మార్చేందుకు సలహాలు, సూచనలు పాటించాలని నారాయణఖేడ్ డివిజన్ రైతులకు సూచనలు చేశారు. బుధవారం సిర్గాపూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యలను నేలలో కలపడం వల్ల సహజ సిద్ధంగా సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని, కంపోస్టు తయారీలో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

సప్తాహ గాథపూజ



గాథపూజలో పాల్గొన్న గాలెమ్మ తదితరులు

నారాయణఖేడ్: పట్టణంలోని కల్పన ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అంతర్గాం పాండురంగ రుక్మిణి ఆలయ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆధ్వర్యంలో గాథ పూజను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దివంగత మాజీ ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి సతీమణి గాలెమ్మ పాల్గొని పూజలు చేశారు. పట్టణ ప్రముఖులు మాణిక్ ప్రభు, గంగయ్య, రాహుల్ రెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వర్గీకరణ అమలులో జాప్యం తగదు



వినతిపత్రం అందజేస్తున్న అబ్రహం

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ బుధవారం ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలులో జాప్యం జరుగుతుందన్నారు. వర్గీకరణ అమలుతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేసే వరకు ఎలాంటి నియామకాలు, నూతన నోటిఫికేషన్లు జారీ చేయొద్దని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన



మట్టి పరీక్షల గురించి వివరిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఉద్యాన కళాశాల విద్యార్థులు మండలంలోని రంజోల్ గ్రామ రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట కోతల అనంతరం మట్టి పరీక్షలు చేసుకోవాలన్నారు. పరీక్ష ఫలితాల కార్డులో చూపించిన విధంగా ఎరువులను వాడాలన్నారు. ఈ సందర్భంగా ఆలు పంటలో సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, విద్యార్థులు పూజిత, అలేఖ్య, వైష్ణవి, ప్రైసీ, స్నేహిత, ప్రీతిలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నామని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెల్లాపూర్‌లో ప్రత్యేక పరిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ నెల 9వతేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

బారికేడ్లు అందజేత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు బుధవారం బారికేడ్లను టౌన్ ఎస్ఐ కాశీనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఏరియా మేనేజర్ సతీష్‌బాబు మాట్లాడుతూ.. సీఎస్ఆర్ నిధులతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం బారికేడ్లు తయారు చేసి ఇచ్చామన్నారు. ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో సంస్థ నిర్వాహకులు ముందుకు వచ్చి బారికేడ్లు అందించడం అభినందనీయమన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సమాచారం త్వరగా నమోదు చేయాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో త్వరగా నమోదు చేయాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు యూడైస్ ప్లస్‌లో లేకపోతే వెంటనే నమోదు చేయాలన్నారు. పుట్టిన తేదీ, పేరు, తరగతి తదితరాల్లో తప్పులు ఉంటే వాటిని సరి చేసుకోవడానికి ఫారాలను నింపి ఎమ్మార్సీలో అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రవి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

◆ **వన్యప్రాణి వారోత్సవాలు**

జహీరాబాద్ టౌన్: అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పక్షుల వీక్షణ, వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. అటవీసంపద గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

◆ **సీఎం కప్‌ను విజయవంతం చేయండి**

మునిపల్లి(అందోల్): సీఎం కప్ నిర్వహణను విజయవంతం చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఎంఈఓ భీమ్‌సింగ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పీఈటీలను కోరారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 7, 8వ తేదీల్లో గ్రామ స్థాయి 10,11,12వ తేదీల్లో మండల స్థాయిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ **పేద కుటుంబానికి ఆపన్నహస్తం**

జోగిపేట(అందోల్): లుకేమియా వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్సలు పొందుతున్న బాధిత కుటుంబానికి జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య ఆపన్నహస్తం అందజేశారు. అందోల్‌కు చెందిన బోయిని మల్లికార్జున్ కుమారుడు అద్విత్ లుకేమియా వ్యాధితో బాధపడుతున్నారు. బాలుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆర్థిక సహాయం చేయాలని వాట్సాప్ గ్రూపులో పెట్టారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అతని కుమారులు బుధవారం రూ.1.51 లక్షలు నగదును బాధితుడి కుటుంబానికి అందజేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, శ్యామ్ పంతులు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.

◆ **విగ్రహ ప్రతిష్ఠకు స్థల పరిశీలన**

సదాశివపేట(సంగారెడ్డి): కొండా లక్ష్మన్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠకు స్థలాన్ని బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, చేనేత సహకార సంఘం సభ్యులు పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ అమరవీరుల స్థూపం వద్ద కొండా లక్ష్మన్ విగ్రహ ప్రతిష్ఠకు ఆమోదించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ ఉమ, టీపీఓ భాస్కర్‌గౌడ్, కౌన్సిలర్ సత్యంగౌడ్, పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత ఆనంద్, పద్మశాలి కులదైవ సభ్యులు పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం .. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురు పట్టుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి రూ. 2 వేలు జరిమానా, ముగ్గురికి రూ.1500, మరో వ్యక్తికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ ఆవరణలో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ , మాజీ గ్రామ సర్పంచ్ ప్రకాశంచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్వీఎం ఆస్పత్రి వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలోని రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారికి ఆపరేషన్లను నిర్వహిస్తారని తెలిపారు.

◆ **బస్సు సౌకర్యం కల్పించాలని వినతి**

సంగారెడ్డి టౌన్ : చౌటకూరు మండలం ఉప్పరిగూడెం, బద్రిగూడెం, శేరిరాంరెడ్డి గూడెం గ్రామాల బాలికలకు బస్ సౌకర్యం కల్పించాలని బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు ప్రభు కుమార్ గౌడ్ కోరారు. బుధవారం సంగారెడ్డి ఆర్టీసీ డీఎం ఉపేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నడుచుకుంటూ రావడానికి ఇబ్బందిగా ఉందని వెంటనే బస్సును ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. డీఎం స్పందించి త్వరలో ఉప్పరిగూడెం గ్రామానికి ప్రత్యేక బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

◆ **సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త**

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ మోసగాళ్లతోజాగ్రత్తగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం సిర్గాపూర్‌లో కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేస్తే ఎలాంటి వివరాలు ఇవ్వవద్దని తెలిపారు. వాట్సాప్‌లో స్నేహితుల ఫొటోలు పెట్టి మాయమాటలతో డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

◆ **ముగిసిన అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు బుధవారం ముగిశాయి. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు 30 మంది పరీక్షలు రాయగా.. మాదారం ప్రాథమిక పాఠశాలలో 19 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష సరళిని జిన్నారం ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి పరిశీలించారు.

◆ **ముర్రుపాలు తాగించాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పకుండా తాగించాలని మిర్జాపూర్(బి) ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నృపిన్ చక్రవర్తి అన్నారు. బుధవారం మండలంలోని హద్నూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో బాలింతలు, గర్భిణీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముర్రుపాలల్లో బిడ్డకు అవసరమైన పోషకాలు ఉంటాయని, తప్పకుండా తాగించాలన్నారు. గర్భిణీలు మంచి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

◆ **ఇండోర్ స్టేడియం నిర్మించాలని వినతి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియంతో పాటు 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మాణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణయ్య మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడిమెదక్ జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వివిధ రకాల స్పోర్ట్స్ అకాడమీలు ఉండడంతో ఇక్కడి క్రీడాకారులు రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించారని అన్నారు. కాలక్రమేణా ఇక్కడ ఉన్న స్పోర్ట్స్ అకాడమీలను ఇతర ప్రాంతాలకు తరలించి సంగారెడ్డి ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేశారని వాపోయారు.

మంత్రి దామోదరకు పుట్టిన రోజు గిఫ్ట్

మునిపల్లి(అందోల్): మంత్రి దామోదర రాజనర్సింహ జన్మదినం సందర్భంగా గురువారం ప్రపంచంలోనే అతిపెద్ద త్రెడ్‌ను మునిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి తయారు చేయించారు. 23 స్క్వేర్ ఫీట్లు గల ఈ త్రెడ్ ఆర్ట్‌కు లక్ష రూపాయలతో, 600 కిలోమీటర్ల దారంతో, 23 ఫీట్ల సర్కిల్ యార్డు వెడల్పుతో మునిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ యూట్యూబ్‌లో త్రెడ్ ఆర్ట్ వీడియోలు చూస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ త్రెడ్ ఆర్ట్ తయారు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రపంచంలోనే ఎవరూ తయారు చేయని విధంగా త్రెడ్ ఆర్ట్‌ను మంత్రి దామోదరకు గిఫ్ట్ ఇవ్వడానికి ప్రత్యేకంగా తయారు చేశామన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ వారికి కూడా ఆన్‌లైన్ పెట్టామని తెలిపారు.



దారపు పోగులతో తయారు చేసిన దామోదర చిత్రం